క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మత్స్యపారిశ్రామిక సహకార సంఘం క్యాలెండర్‌ను సోమవారం చిగురుమామిడిలో ఆవిష్కరించారు. పెద్దమ్మతల్లి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు. జిల్లా డైరెక్టర్ జక్కుల బాబు, ఉమెన్ ఫిషరీస్ జిల్లా చైర్మన్ పోలు స్వప్న, ముదిరాజ్ మండల అధ్యక్షుడు పెసరి రాజేశం, మాజీ సర్పంచులు రవి, వెంకటేశం, సంఘాల అధ్యక్షులు జెట్టి తిరుపతి, చిరంజీవి, సంతోష్, బాలయ్య, శ్రీనివాస్, నారాయణ, రమేశ్, సదానందం, పలువురు పాల్గొన్నారు. అనంతరం జక్కుల బాబు, పోలు స్వప్నను ఘనంగా సన్మానించారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

హుజూరాబాద్: జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికాస పిల్లల జన్మదిన వేడుకలు సోమవారం మున్సిపల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలువురు అనాథ బాలల జన్మదిన వేడుకలు సంస్థ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మేనేజర్ లతా ప్రతాపరెడ్డి, ఆఫీస్ స్టాఫ్ జ్యోతి, పులుగు లతారెడ్డి, మేనేజర్ ఖజాబీ, రజిత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం రిక్వెస్ట్‌స్టాప్ ఏర్పాటు చేశామని డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. శంకరపట్నం, వీణవంక, సైదాపూర్ మండలాలకు చెందిన ప్రయాణికులు మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద బస్సులు ఆపడం లేదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. ప్రజల విన్నపంతో కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులు క్రాస్‌రోడ్డు వద్ద ఆపాలని డిపో మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

నగదు అందజేత

సైదాపూర్: వెన్కెపల్లిలో పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఏగుర్ల సంపత్ ఇటీవల మృతిచెందాడు. ఆయన భార్య రేణుకకు పొదుపు సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ సోమవారం బీమా నగదు రూ.69113 అందజేశారు. కార్యక్రమంలో వెన్కెపల్లి సంఘం అధ్యక్షుడు వెల్డి రాజు, ఉపాధ్యక్షుడు దొంత కిరణ్, సభ్యులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాములు, స్వామి, రాజు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

సైదాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల 2025 ఓటరు జాబితాను సోమవారం ఎంపీడీవో కార్యాలయంతో పాటు మండలంలోని పంచాయతీల కార్యాలయాల్లో ప్రదర్శించారు.

మద్యం బాటిల్‌లో చెత్తా

హుజూరాబాద్: పట్టణంలోని ఓ వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేయగా మందుబాటిల్‌లో చెత్తాచెదారం కనిపించింది. ఇదేంటని షాపు యజమానిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వినియోగదారుడు వీడియో తీస్తుంటే అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎక్సైజ్ అధికారులు స్పందించి నాణ్యమైన మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వదేశీ మేళా 5కే రన్

కరీంనగర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్న స్వదేశీ మేళా విజయవంతం చేయాలని సోమవారం నగరంలో 5కే రన్ నిర్వహించారు. 1,400 మంది పాల్గొన్న రన్‌లో పీటీసీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుంకరి శ్రీనివాస్, సీనియర్ వైద్యులు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.కిషన్, స్వదేశీ మేళా బాధ్యులు చెలిమెడ రాజేశ్వరరావు, స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కన్వీనర్ సీఏ హరీశ్ బాబు, మాధవరావు, క్లెం వాసుదేవరెడ్డి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వార్డు అధికారుల ద్వారానే పన్ను వసూళ్లు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు అధికారుల ద్వారానే పన్నుల వసూళ్లు జరుగుతుందని కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీ, ఆరు గ్రామాల్లో వార్డు అధికారులే ప్రత్యేక యంత్రాల ద్వారా ఇంటి పన్నులు, ట్రేడ్‌లైసెన్స్‌లు, నల్లా బిల్లులు వసూలు చేస్తారని తెలిపారు.

నీటి సరఫరా బంద్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని గౌతమినగర్ రిజర్వాయర్ పరిధిలో మూడు రోజులుగా నల్లా నీటి సరఫరా రాకపోవడంతో ఏరియా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందస్తు సమాచారం లేకుండా నీటి సరఫరా బంద్ చేయడంతో నీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు మండిపడుతున్నారు.

పథకమేదైనా ప్రారంభమిక్కడే

- సంక్షేమ పథకాల అమలుకు కేరాఫ్ ఇప్పలపల్లి
- గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంపిక
- ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం



సంక్షేమ పథకాల మంజూరు పత్రం అందుకుంటున్న మహిళ(ఫైల్)

శంకరపట్నం: దశాబ్దకాలం క్రితమే ఇంటింటికీ మరుగుదొడ్డి, ఇంకుడుగుంత నిర్మించి నిర్మల్ పురస్కారం అందుకుంది మండలంలోని ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ. ప్రభుత్వ పథకం మొదటగా ప్రారంభించాలంటే అధికారులు ఇప్పలపల్లి గ్రామాన్ని ఎంపిక చేస్తారు. ఎటువంటి గొడవలు జరగకుండా గ్రామంలో సభలు, అభివృద్ధిపనులు జరుగుతాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకంలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. శంకరపట్నం మండలం నుంచి ఇప్పలపల్లి గ్రామం ఎంపికైంది. పథకంలో భాగంగా లబ్ధిదారులకు రూ.పదిలక్షల విలువ చేసే వాహనాలు, వివిధ దుకాణాల ఏర్పాటుకు నాటి ప్రభుతం నిధులు విడుదల చేసింది. గ్రామంలో పది దళిత కుటుంబాలుంటే తొమ్మిది మందికి ట్రాక్టర్లు, కార్లు అందించడంతోపాటు వివిధ దుకాణాలు ఏర్పాటు చేయించారు.

సంతోషంలో ప్రజలు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు పథకాల అమలుకు జనవరి 26న శ్రీకారం చుట్టింది. వీటి అమలుకు మండలంలోని ఇప్పలపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా అధికారులు ఎంపిక చేశారు. అంతకు ముందు నిర్వహించిన గ్రామసభ సజావుగా సాగింది. నాలుగు పథకాలను ప్రారంభించి ఎంపికైన లబ్ధిదారులకు అధికారులు మంజూరు పత్రాలు అందించారు. గ్రామంలో 254 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే స్థలం ఉన్న 87 మందికి, 121మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 70 మందికి, 21 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 349 మందికి రైతుభరోసా మంజూరు పత్రాలు అందించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా డబ్బులు లబ్ధిదారుల ఖా తాల్లో జమకావడంతోపాటు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాల అమలుకు ఇప్పలపల్లిని ఎంపిక చే యడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శంగా నిలవాలి



మాగ్రామానికి చెందిన అర్హులందరికి నాలుగు పథకాలు అందాయి. సొంత స్థలం ఉన్నవారు ఇంటి నిర్మాణం చేపట్టి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలి. ఇన్నేళ్లకు రేషన్ కార్డులు ఇవ్వడంతో కూలీపనులు చేసుకునే పేదలకు రేషన్ బియ్యంతోపాటు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు అందనున్నాయి.

– బైరి సంపత్, మాజీ సర్పంచ్

పనులు త్వరగా చేపట్టాలి



కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 26న ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు ఇప్పలపల్లిని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశాం. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి, రెండో విడతలో మిగతా వారికి ఇళ్లు మంజూరవుతాయి. మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందించాం. ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా చేపట్టాలి.

– కృష్ణప్రసాద్, ఎంపీడీవో

రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి రైతువేదికలో సోమవారం కస్టమ్ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)పై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ మాజీ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి సహకారం, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ యాజమాన్యంతో కలిసి గ్రామాన్ని ఎంచుకున్నామని తెలిపారు. సెంటర్‌లో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంటాయని, పరికరాలను రైతులకు కిరాయి ఇవ్వడం జరుగుతోందని, పని ముగిసిన అనంతరం తిరిగి అప్పగించాల్సి ఉంటుందన్నారు. కేంద్రం చిన్న,సన్నకారు రైతులకు ఎంతో తోడ్పాటుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ఏఈవో కీర్తికుమారి పాల్గొన్నారు.

శాకాహారంలోనే పోషకాలు, ప్రోటీన్లు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓదెలు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో పోషకాహారం, ఆర్థిక అంశంపై హుజూరాబాద్ వృక్షశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ ఓదెలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆదాయ పరిమితిలోనే సంపూర్ణ పోషకాహారం పొందవచ్చని, తక్కువ ఖర్చుతో కాలానుగుణంగా లభ్యమయ్యే పండ్లు, ఆకుకూరలు, ఎక్కువగా తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అధిక ఖర్చుతో కూడిన మాంసాహారం కంటే శాకాహారంలోనే ఎక్కువ పోషకాలు, ప్రోటీన్లు, విటమిన్లు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.రమేశ్, అధ్యాపకులు కుమార్, రాజేంద్రం, డా.రవి, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయసాధనలో ఆత్మవిశ్వాసం కీలకం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మానకొండూర్: విజయ సాధనలో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం కీలకమని ప్రముఖ రిహాబిలిటేషనర్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీసీ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టుదలతో 10 జీపీఏ సాధించవచ్చునని, పరీక్షలను ధీమాగా రాయాలని, విజయాలు సాధించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఉత్సాహంగా, ఆనందంగా ఉండాలని, టెన్షన్ దరిచేయనీయొద్దన్నారు. కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ ప్రకాశ్, గంగారాం, రమేశ్, భానుప్రకాశ్, రాజీమహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రంగనాథశర్మ, ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందన

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కొక్కుల శివమణి (తొమ్మిదో తరగతి), కోన్న హర్షిత్‌రెడ్డి (ఎనిమిదో తరగతి), గైడ్ శ్రావణ్‌కుమార్, తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లిలో జరిగిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జంబోరీ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, గైడ్‌ను హెచ్‌ఎం రంగనాథశర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి



ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులతో సమావేశమైన డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కీలకమైనదని, ఉద్యోగులు, అధికారులు జవాబుదారితనంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి అన్నారు. ప్రత్యేకాధికారి, కమిషనర్‌ల ఆదేశాల మేరకు సోమవారం ఆమె ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులు, అధికారులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వహణలో సమాచారాన్ని గోప్యంగా ఉంచాలన్నారు. ఇతరులకు ఎలాంటి విషయాలు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. అందరూ కలిసికట్టుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ ఉండొద్దని, అన్ని క్లియర్ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల ప్రయోజనాలు పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులు, అధికారులు పారదర్శకంగా ఉండాలని హితవు పలికారు.

ఆర్‌వో ప్లాంటు వితరణ



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాస్, దాత, తదితరులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన వ్యాపారి పాత శ్రీనివాస్ రూ. 25 వేల విలువైన ఆర్‌వో ప్లాంట్‌ను వితరణ చేశారు. ఎంఈవో దీక్షితుల శ్రీనివాస్ దాతతో కలిసి ఆర్‌వో ప్లాంట్ ప్రారంభించారు. పుట్టిన రోజు పురస్కరించుకొని విద్యార్థులకు మినరల్ వాటర్ కష్టాలను తీర్చేందుకు ఆర్‌వో ప్లాంట్ అందించామని దాత తెలిపారు. చొప్పదండి లయన్స్ క్లబ్ ద్వారా దాత వాటర్ ప్లాంట్ బహూకరించడం అభినందనీయమని ఎంఈవో అన్నారు. కార్యక్రమంలో లయన్ మోర భద్రేశం, మహేశుని మల్లేశం, సత్యనారాయణ, కొ ల్లూరి ఆనందం, జితేందర్, వల్లాల క్రిష్ణహరి, లక్ష్మయ్య, దూస రాము, బొల్లం సాంబమూర్తి, కానుగంటి రాజమౌళి, గంగాధర్, హరిత, వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కమిషనర్ సమ్మయ్యను సన్మానిస్తున్న రిటైర్డ్ పెన్షనర్ సంఘం బాధ్యులు

హుజూరాబాద్: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమ్మయ్యను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజూరాబాద్ అధ్యక్షుడు శనిగరం నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం సంఘం బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా పట్టణంలోని వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం మేనేజర్ రావుల భూపతిరెడ్డి, హనుమాన్ దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ ఆకుల సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని వెంకటయ్య, రిటైర్డ్ సంఘం బాధ్యులు సయ్యద్ మునీరుద్దీన్, రావికంటి రామకృష్ణయ్య, చీకట్ల సమ్మయ్య, తాటిపాముల కనకయ్య, గంగిశెట్టి సాంబయ్య, తౌటం శ్రీహరి, వేల్పుల భాస్కర్, గాజర్ల బుచ్చి రాజం, ముక్కెర మొగిలి, గూడూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులో అకస్మాత్తుగా బైక్‌కు అడ్డంగా కోతిరావడంతో భార్యభర్తలు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడిపోయారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన దంపతులు సోమవారం హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన దంపతులను స్థానికులు కరీంనగర్‌కు తరలించారు.

కేసు నమోదు

జమ్మికుంట: దాడికి పాల్పడిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్‌పాషాపై అదేకాలనీకి చెందిన షేక్ ఫిరోజ్, అప్రోజ్ అకారణంగా దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

జమ్మికుంట: కోళ్లు, కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తిపై దాడికి పాల్పడగా ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఇంటి వాకిలిని పాడుచేస్తున్నాయని గంగ్రపల్లికి చెందిన జ్యోతిని గ్రామానికే చెందిన మల్లయ్య, పుష్పమ్మ, రాజమ్మ బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. బాధితురాలి భర్త సంతోష్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.



చొప్పదండి: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న బోర్‌వెల్‌కు మరమ్మతులు చేపట్టి శ్మశానవాటికకు నీటి సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. బోర్‌వెల్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని, కనీసం మరమ్మతు చేసి దహన సంస్కారాలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, చొప్పదండి మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 9949267882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆధ్యాత్మికం

శ్రీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శంకరపట్నం: హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మల గుడి) బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. 11న నిత్యసేవ, ఎదుర్కోలు, 12న శ్రీవిశ్వేశ్వరస్వామి కల్యాణం, 13న రాత్రి పెద్ద రథోత్సవం, 14న చిన్నరథంపై స్వామివారి ఊరేగింపు, 15న స్వామివారి పవలింపు సేవ, గర్భాలయ ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, సోమవారం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ నిర్వహించామని అర్చకులు తెలిపారు.

వైభవంగా ఆంజనేయ అష్టోత్తర కలశ పూజలు

హుజూరాబాద్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం వేద పండితులు అష్టోత్తర కలశ పూజలు శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి కలశ పూజ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, వేద పండితులు నందకిషోరాచార్యులు, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.



రామడుగు: శివాలయంలో భక్తుల పూజలు

వైభవంగా వార్షికోత్సవం

రామడుగు: మండలంలోని వెదిర శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం దేవాలయంలో పూజారి సాయి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, ఆశీర్వచనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు.

మత్స్యగిరీంద్రుడికి సదస్యం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సదస్యం, శేషవాహనంపై స్వామివారు మా డవీధుల్లో విహరించారు. హోమం, బలిహరణం, రాజభోగం, తీర్థగోష్ఠి ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



హుజూరాబాద్: పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



జమ్మికుంట: శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

తిమ్మాపూర్: తెలంగాణ షార్ట్ ఫిల్మ్ మేకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. పోటీల్లో విన్నర్‌గా డాకు మహారాజ్ కెప్టెన్ కలర్ సత్తన్న టీం, రన్నర్‌గా విశ్వంభర కెప్టెన్ సాయి మల్ల మధు టీం గెలుపొందగా విజేతలకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమళ్ల శ్రీనివాస్, సినీ నటుడు రాదండి సదయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా పురమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఎవరు గెలిచినా ఓడిన అధైర్య పడకుండా ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సీతామాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నడిమెట్ల గణేష్, కోశాధికారి కనపర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లోకిని కుమార్,సదన్ యాదవ్, రుద్రోజు వాయుకుమార్, అనిత్ రాజ్, సొల్లరారి, రాజారాం మోహన్ రెడ్డి, సిద్ధు కనకం ,డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి సేవలందించడానికి అవకాశం ఇవ్వండి

కరీంనగర్: ఆరేళ్లుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నీతిని జాయితీతో పనిచేస్తూ ఉపాధ్యాయులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ సేవలందించిన తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తమరెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం నగరంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో వివిధ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఆరేళ్లుగా అహర్నిశలు శ్రమించానని, సంఘాలతో సంబంధం లేకుండా తన సాయం కోరి వచ్చిన అందరికీ సేవలు అందించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ, టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.లచ్చిరాం, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.